విశాలాంధ్ర
విజయనగరం
పేజి నెం. 8
శుక్రవారం 9, మే 2025

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర - రామభద్రపురం: గంజాయి కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఒడిస్సా రాష్ట్రం పొట్టంగి బ్లాకు కొండై గ్రామానికి చెందిన దిలీప్ దూ సర బారిక అనే వ్యక్తి 2024 సంవత్సరం క్రైమ్ నెంబర్ 202 గంజాయి కేసులో ముద్దాయిగా ఉన్నాడని, అప్పటినుంచి ఇంతవరకు పరారిలో ఉన్నాడన్నారు. గురువారం మధ్యాహ్నం బైపాస్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగు తుండగా అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడని తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

చిన్న శ్రీను.. పెద్ద పోరాటం

- జిల్లాలో వైసీపీకీ ఆయనే పెద్దదిక్కు
- అధికార పార్టీ నేతలను ధీటుగా ఎదుర్కొనే సత్తా ఉన్న నేత
- జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో మాజీల మౌనం

విశాలాంధ్ర - విజయనగరం: రాజకీయాలకు కీలకమైన జిల్లాగా ఉన్న విజయనగరం జిల్లాలో ఒకప్పుడు వైసీపీ అధికారంలో ఉండగా లెక్కనేనంత మంది నేతలు కనిపించేవారు. కానీ మొన్నటి ఎన్నికలలో ఘోర పరాజయం అనంతరం కనీసం తమ పేర్లు కూడా బైటకు రాకుండా ఆయా నేతలు జాగ్రత్త పడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలో అధికార పార్టీని ధీటుగా ఎదుర్కొనే సత్తా ఉన్న నేత ఎవరైనా ఉన్నారా అంటే ఠక్కున వినిపించే పేరు మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను.. అవును ఆయన మాత్రమే ప్రస్తుత పరిస్థితిలో అధికార పార్టీకి చెందిన నేతలకు సరైన కౌంటర్ ఇవ్వగలరని అందరూ అంగీకరించాల్సిన వాస్తవం.

జిల్లాలో అన్ని అసెంబ్లీస్థానాలను కోల్పోయిన వైసీపీకి మాత్రం స్థానిక సంస్థలలో బలం ఉంది. అంతేకాకుండా అనేక మండలాలు, జిల్లా పరిషత్ పీఠాలు వైసీపీ పక్షానే ఉన్నాయి. ఇక జెడ్పీ చైర్మన్‌గా అటు అన్ని మండలాల సమస్యలపైనా, ఇటు పార్టీ బలోపేతం పైనా చిన్న శ్రీను పెద్ద బరువును మోస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోనే కాకుండా విశాఖ జిల్లాలోని భీముని పట్నం నియోజకవర్గాన్ని అధినేత చిన్న శ్రీనుకు అప్పగించారు. దీంతో బాహుబలిలా ఇటు జిల్లాలోని పార్టీని, నియోజకవర్గాల నేతల సమస్యలను, అటు భీమిలి నియోజకవర్గ సమస్యలను తన భుజస్కందాలపై మోస్తున్నారు.

అధికార పార్టీని ధీటుగా ఎదుర్కొంటూ..

పార్టీ కార్యక్రమాలు, జిల్లాలోని స్థానిక సమస్యలపై నిత్యం బిజీగా ఉండే చిన్న శ్రీనుకు అధికార పార్టీకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల వాఖ్యలకు సైతం తగిన విదంగా కౌంటర్ ఇస్తున్నారు. ఇటీవల జిల్లా పరిషత్‌లో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ధీటుగా ఎదుర్కొన్న సంఘటనను హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పష్టంగా ఇప్పటికీ గుర్తు పెట్టుకున్నారు. అంతా వన్‌మేన్ ఆర్మీ అనే విదంగా చిన్న శ్రీను నడిపించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఏదిఏమైనా చిన్న శ్రీను పెద్ద పోరాటం చేస్తున్నారనేది జిల్లా వాసులకు అందరికీ తెలిసిందే..

అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలేరి..?

పోతనాపల్లి కేంద్రంలో వెలుగుచూసిన వైనం

(విశాలాంధ్ర విజిట్)

విశాలాంధ్ర - శృంగవరపుకోట (విజయనగరం) : చిన్నారులకు పౌష్టికాహారం పెడుతూ, వారికి విద్యాబుద్ధులు నేర్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే క్షేత్ర స్థాయిలో ఈ కేంద్రాలలో చిన్నారులు లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్‌ల దృష్టికి ఈ సమస్యలు రాకపోవడం విడ్డూరమే. శృంగవరపుకోట మండలంలోని పోతనాపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని విశాలాంధ్ర గురువారం ఉదయం పరిశీలన చేసింది. ఉదయం 11గంటల సమయంలో కేంద్రం తెరిచి వున్నా ఒక్క చిన్నారి కూడా లేకపోవడంతో టీచర్‌ను ప్రశ్నించగా అందరూ ఇంటికి వెళ్ళిపోయారని సమాధానం చెప్పారు. ఇక వంటకాలను చూస్తే కేవలం ఉడకబెట్టిన గుడ్లు 3 మాత్రమే ఓ పాత్రలో దర్శనమిచ్చాయి. వంట వండిన దాఖలాలు కనిపించలేదు. దీనిపై ఎస్‌కోట ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాను వివరణ కోరగా పర్యవేక్షణ చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఈకేంద్రంపై గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కమిషనర్ బంగ్లా, విపణికల్ప కాంప్లెక్స్ నిర్మాణాల డిజైనింగ్ పరిశీలన

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన కమిషనర్ బంగ్లా, విపణికల్ప కాంప్లెక్స్ నిర్మాణాల రూపకల్పనకు అవసరమైన డిజైనింగ్, ఆర్కిటెక్ పరిశీలన జరిగింది. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో డిఇలు శ్రీనివాసరావు, ప్రసాదు, ఆర్కిటెక్ డిజైనర్‌తో కలిపి గురువారం మహారాణిపేటలో ఉన్న పాత కమిషనర్ బంగ్లా ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మెయిన్ రోడ్‌లో ఉన్న విపణికల్ప కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆధునిక హంగులతో రెండు భవనాలు నిర్మించేందుకు అవసరమైన డిజైనింగ్ రూపకల్పన చేసేందుకు ఈ పరిశీలన దోహదపడుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - గుర్ల: గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ అచ్యుతాపురం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.త్రినాధరావు తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగించుట కొరకు చోడవరం, పెనుబర్తి, చుక్కపేట, చింతపల్లి పేట, గంగిరెడ్డి పేట, అచ్యుతాపురం, తెట్టంగి, పోలాయివలస గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

ఆకలితో వెనుదిరుగుతున్న నిరుపేదలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: మండలంలో టీడీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్ పథకంలో ప్రజలకు భోజనం అందక ఆకలితో నిరుపేదలు వెనుదిరు గుతున్నారని బీజేపీ నెల్లిమర్ల మండల అధ్యక్షులు మైపాడ ప్రసాద్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చింనాయుడు, నాయకులు మజ్జి రాంబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నడిపేన నారాయణ మూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్యాంటీన్లలో భోజనం చేద్దామని వెళ్తే కడుపు నింపని భోజనం పెడుతున్నారన్నారు. అన్నా క్యాంటీన్‌లో పార్శిల్ కట్టే నిబంధన లేకున్నా సిబ్బంది కొంతమందికి పార్శిల్ చేస్తున్నారని, క్యాంటీన్ సిబ్బంది నిర్వాహకం వల్ల పేదలకు అందాల్సిన ఆహార పదార్థాలు పక్కదారి పడుతున్నాయన్నారు. దీంతో పేదలకు ఆహారం అందడం లేదని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎమ్మెల్యే కళాకు తెలుగు తమ్ముళ్ల పరామర్శ

విశాలాంధ్ర - మెరకముడిదాం: ఇటీవల కంటికి శస్త్ర చికిత్స జరిగిన చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావును మెరకముడిదాం మండలం గాదిల మర్రివలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు గాదిల మర్రివలస గ్రామ అభివృద్ధిపై ఆరా తీశారు. ఇచ్చిన మాట ప్రకారం 3 కోట్ల 75 లక్షలతో బడ్డనాయనివలస నుంచి రాజుల రామచంద్రపురం వరకు తారురోడ్డు మంజూరు చేసినందుకు నేతలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల తెలుగు యువత అధ్యక్షులు చల్ల శ్రీరామ్, దాది అప్పలనాయుడు, చల్ల రామచంద్రుడు, ఇజ్జురోతు వెంకటి, దాది పైడితల్లి, బైరెడ్డి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలిద్దాం గ్రామ ప్రగతిని సాధిద్దాం

విశాలాంధ్ర - మెంటాడ: నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యంగా ఏర్పాటు చేయబడిన నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ జె.జనార్దన్‌రావు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జి.టి.పేట, వానిజ పంచాయతీ పరిధిలో నాటు సారా రహిత సమాజ నిర్మాణం కొరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారిపై బైండోవర్ కేసులు పెడతామన్నారు. సారా సంబంధిత ఫిర్యాదుల కోసం 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. అనంతరం తమ్మి రాజుపేట గ్రామాన్ని నాటుసారా రహిత గ్రామంగా డిక్లేర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎల్.ముత్యాల నాయుడు, వీఆర్వో భగవాన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జగదీష్, ఎస్‌హెచ్‌జి వర్రీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని తెర్లాం తహశీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు. కొత్తగా పెళ్లయిన వారు కొత్త రేషన్ కార్డుల కోసం, పాత రేషన్ కార్డులో మరణించిన వారి పేర్లు తొలగింపు, కొత్త వ్యక్తుల పేర్లు నమోదు వంటి వాటి కోసం దగ్గరలో ఉన్న సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న సచివాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో తెర్లాం అడ్డు రోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డు లేకుండా వాహనాలు నడిపిన వారికి భారీ జరిమానాలు విధిస్తామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, ఇన్సూరెన్స్ లేకపోయినా, బండి పేపర్లు లేకపోయినా, మద్యం తాగి వాహనాలు నడిపిన, వాహనాలు అతి వేగంగా నడిపిన అలాంటి వారిపై ఆన్లైన్ కేసులు తప్పనిసరన్నారు.

పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ తనిఖీ

విశాలాంధ్ర - డెంకాడ: మండల కేంద్రంలోని డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్.జీవనరాణీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మందులు నిల్వ, రికార్డులు, మాతా శిశు సంరక్షణ, ఇతర జాతీయ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల ఈఈడిలను గుర్తించి గర్భిణీలు ప్రసవాలకు వచ్చేలా చూడాలని అన్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో ప్రసవం అయ్యేవరకు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ప్రజలకు వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి చంద్రశేఖర్ రాజు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - లక్కవరపుకోట: వివిధ ప్రాంతాలలో మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరించి దొంగిలించిన నియోజకవర్గంలో దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ వేపాడ మండలం పాటూరు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో ఒక ఆటోలో 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒక మోటారు, రెండు కారు బ్యాటరీలు, ఒక విద్యుత్ వైరు కట్ట తరలిస్తుండగా ఎనిమిది మంది వ్యక్తులు పట్టుబడగా ఇద్దరు పరారీలో ఉన్నారని ఆరుగురుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. వీటి ఖరీదు సుమారు 5 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. ఎల్.కోట ఎస్సై సిహెచ్ నవీన్ పడాల్, వల్లంపూడి ఎస్సై ఎస్.సుదర్శన్‌రావు, జామి ఎస్ఐ వై.వీర జనార్దన్ ఆధ్వర్యంలో సిబ్బంది చాకచక్యంగా ఈ దొంగలను పట్టుకోవడం జరిగిందన్నారు.

ఎస్.కోటలో వరల్డ్ రెడ్ క్రాస్ డే

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో కొలపర్తి హాస్పిటల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సబ్-డిస్ట్రిక్ట్ బ్రాంచ్ వారు వరల్డ్ రెడ్ క్రాస్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ స్థాపకుడు హెన్రీ దునత్ చిత్రపటానికి పూలమాలలు వేసి సభ్యులు అంజలి ఘటించారు. ఎస్.కోట రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ చైర్మన్ డా. వి.వరలక్ష్మి మాట్లాడుతూ 1948 నుంచి ప్రతి సంవత్సరం మే 8న హెంద్రీ దునత్ పుట్టినరోజును వరల్డ్ రెడ్ క్రాస్ డేగా జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంసీ మెంబర్ డి. సూర్యరావు, వైస్ చైర్మన్ ఆశపు మల్లేశ్వరరావు, కోశాధికారి శ్రీనాథ్, డా. గణేష్, హాస్పిటల్ సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

23మంది పాత నేరస్తులపై బైండోవర్

విశాలాంధ్ర - కొత్తవలస : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0లో భాగంగా కొత్తవలస మండలంలోని అప్పన్నదొరపాలెం, జోడిమెరక, తమ్మన్నమెరక, చిన మన్నిపాలెం గ్రామాల్లో గతంలో నాటు సారాయి కేసుల్లో ఉన్న 23మంది పాత నేరస్తులపై గురువారం కొత్తవలస తహసీల్దార్ బి.నీలకంఠరావు సమక్షంలో బి.ఎన్.ఎస్.ఎస్-129 ప్రకారం బైండోవర్ చేసినట్లు కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్.హెచ్.ఓ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు తెలిపారు. అలాగే తమ్మన్నమెరక గ్రామంలో ఒక లీటర్ నాటు సారాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు వి.ఎన్.రాజు, ఎన్.రమ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ హోంగార్డు కుటుంబానికి 'చేయూత'

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బి.సుందరరావుకు 'చేయూత'ను అందించేందుకు హోంగార్డు సిబ్బంది ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు చెక్కును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణించిన లేదా ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు హోంగార్డు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్సు కమాండెంట్ టి. ఆనంద బాబు, ఆర్.ఆర్.రమేష్ కుమార్, సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య "ఆపరేషన్ సిందూర్"

ఎమ్మెల్యే కళా వెంకటరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించేందుకు, ఆహ్లాదమైన వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాటకులను అన్యాయంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే "ఆపరేషన్ సిందూర్" అని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. రాజాంలో గల క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనం అని వెల్లడించారు. అందరూ ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తిప్పి కొట్టాలని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుందామని, ఉగ్రవాదుల దాడుల నుంచి దేశ పౌరులను రక్షించుకుందామని పిలుపునిచ్చారు.

గొప్ప మానవతా సంస్థ...రెడ్‌క్రాస్

విశాలాంధ్ర - బొబ్బిలి: రెడ్ క్రాస్ గొప్ప మానవతా సంస్థ అని సరిహద్దులకు అతీతంగా ఐక్యత, సేవ, మానవతా సంబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రపంచానికి సేవలందిస్తున్న సంస్థ రెడ్ క్రాస్ అని రోటరీ జిల్లా అధ్యక్షులు, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబెర్ జెసి రాజు అన్నారు. బొబ్బిలి రోటరీ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ నేపథ్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని గురువారం క్లబ్ అధ్యక్షులు, రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్ సిందిరి శ్రీనివాస్ రోటరీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీల ప్రసూతి వైద్యులు డాక్టర్ శ్రావణి ఆయన చిత్రపటా నికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జెసి రాజు మాట్లాడుతూ మానవత్వాన్ని సజీవంగా ఉంచుదాం అనే స్ఫూర్తితో ప్రపంచ రెడ్ క్రాస్ సంస్థ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. 190 పైగా దేశాలలో అత్యంత దుర్భరంగా ఉన్నవారికి సహాయం చేయటానికి ప్రపంచ రెడ్ క్రాస్ సంస్థ పని చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మానవతా సూత్రాన్ని పాటిస్తూనే విపత్తుల నుండి ఉపశమనం, ఆరోగ్య సేవలు, రక్తదాన శిబిరాలు, అత్యవసర సహాయాన్ని అందిస్తూ 3 పర్యాయాలు నోబుల్ శాంతి బహుమతిని అందుకున్న సంస్థ రెడ్ క్రాస్ అన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్లు శివ కాంత్, కృష్ణ మోహన్ ప్రవీణ్ కుమార్, అవినాష్, అలజంగి చిన్నా రావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని వాకర్స్ క్లబ్ గవర్నర్ ఎలెక్ట్ ఆరికతోట తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. గురువారం విజయనగరం పట్టణంలోని ఉడా కాలనీలో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వాకర్స్ గవర్నర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన విజయనగరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పాదచారులు, వాహన చోదకులకు ఎండ వేడిమికి వడదెబ్బకు గురికాకుండా ఈ చలివేంద్రాలు చల్లని మంచినీరు, మజ్జిగను అందించి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ పూర్వపు గవర్నర్ కొత్తల ఎర్రి నాయుడు, డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి, ఈవెనింగ్ వాకర్స్ క్లబ్ సలహాదారు త్యాడ చిరంజీవి రావు, ప్రతినిధులు డి.శ్రీరామ్మూర్తి, అల్లంకి బసవ మూర్తి, పప్పు విశ్వనాథం, డి.శ్రీనివాసరెడ్డి, రామరాజు జీఎస్ఎన్.రాజు, కోశాధికారి ఆదినారాయణ, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

విశాలాంధ్ర - భోగాపురం: భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, డ్రోన్స్, బాంబ్, డాగ్ స్క్వాడ్తో తనిఖీలు ముమ్మరం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్త కుండా అప్రమత్తమైనట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ముఖ్య ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో అప్రమత్తమై, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా నియంత్రించుటకు తనిఖీలు ముమ్మరం చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు ఉన్నతాధి కారుల ఆదేశాలతో జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూలు, చింతపల్లి లైట్ హౌస్, తీర ప్రాంతంలోని గ్రామాల్లోను మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా తని ఖీలు చేపట్టి, తీరప్రాంత గ్రామస్థులను అప్ర మత్తం చేసామన్నారు. అంతేకాకుండా, కోరుకొండ సైనిక్ స్కూలు, అధికార భవనాలు, చింతపల్లి లైట్ హౌస్ తోపాటు మరియు ఇతర తీరప్రాంత గ్రామాలైన తిప్పలవలస, ముక్కాం, నీలగెడ్డపేట, పాద్దూరు, చేపల కంచేరులో డ్రోన్స్, డాగ్స్, బాంబు స్క్వాడ్స్ తనిఖీలు చేపట్టామన్నారు. సముద్రంలో చేపల వేట పై నిషేదం ఉన్నందున మత్స్యకారులను వేటకు వెళ్ళవద్దని, తీర ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే షిప్పులు, అనుమానస్పద వ్యక్తులు ఎదురుపడితే సమాచారాన్ని మెరైన్ లేదా స్థానిక పోలీసులకు అందించాలని కోరామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భోగాపురం సిఐ కే.దుర్గా ప్రసాద్, మెరైన్ సిఐ బి.వి.జె.రాజు, భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ వెతలు....

- సంక్షేమ పథకాలకు ఆమడ దూరంలో మారిక గిరిజనులు

విశాలాంధ్ర - వేపాడ: నాటి నాగరికత యుగం నుండి నేడు పరిణితి చెందిన కంప్యూటరీకణ యుగం వరకు ఆ గిరిజనులకు వెతలు తప్ప లేదు. కాగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలకు ఆమడ దూరంలో ఉండడంతో వారికి సంక్షేమ ఫలాలు అందేది అంతంత మాత్రమేనని చెప్పక తప్పదు. మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర గ్రామమైన మారిక గిరిజనులకు ఈ వెతలు తప్పేది ఎప్పుడోనని ఎదురు చూస్తున్నారు. కరకవలస పంచాయతీ నుండి గిరిజన గ్రామాలైన మారికకు సుమారు 10 కిలోమీటర్ల మేర కాలినడకన కొండపై నుండి కిందకు దిగివచ్చి తమ నిత్యావసర సరుకులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌరసరఫరాల బియ్యాన్ని తీసుకెళ్లాల్సిన పరిస్థితి. మారిక గ్రామానికి రోడ్డు కోసం ఎన్నో పోరాటాలు చేయడంతో రోడ్డు మంజూరై పనులు చేస్తుండడంతో అవస్థలు తప్పుతాయి అనుకున్నారు. అయితే మారిక గ్రామానికి చెందిన భూములను అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్పచెప్పుతాయన్న సందేశాలు ఆ అమాయక గిరిజనులకు వినబడడంతో పోరాటాలకు సిద్ధమై మళ్లీ వారి జీవితాలు మొదటికే వచ్చాయన్న ఆందోళనతో సతమతమవుతున్నారు. వారు నమ్ముకున్న అడవి తల్లిని వారి జిరాయితి భూములతో పాటు వారు సాగు చేసుకుంటున్న పోడు భూములను ఖాళీ చేసి వెళ్లిపోవాలనే సంకేతాలు వినిపించడంతో ఏమి చేయాలో తోచక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమై పోరాటాలు చేస్తున్నారు. ఏది ఏమైనా అనాదిగా జీవిస్తున్న ఆ గిరి శిఖర మారిక గ్రామాలను ఆ గిరిజనులకు వదిలేస్తారా లేక ఖాళీ చేయిస్తారో వేచి చూడాల్సిందే.

నాటుసారా రహిత గ్రామంగా మీసాల డోలపేట

విశాలాంధ్ర - రాజాం/రేగిడి: మీసాల డోలపేట గ్రామాన్ని నాటుసారా రహిత గ్రామంగా నిర్ణయించినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. రేగిడి ఆమదాల వలస మండలంలో ఉన్న మీసాల డోలపేట గ్రామంలో గతంలో నాటుసారా కేసులు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం ఆ గ్రామాన్ని సి - కేటగిరిలో చేర్చిందని, నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మీసాల డోలపేట గ్రామంలో నాటుసారాపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. గ్రామ సర్పంచ్ బుగత కృష్ణ, ఇతర గ్రామ కో ఆర్డినేషన్ కమిటీ యొక్క సహకారంతో మీసాల డోలపేట గ్రామంలో నాటుసారా ఆనవాళ్లు పూర్తిగా లేకుండా చేయడంతో నాటుసారా రహిత గ్రామంగా నిర్ణయించినట్టు తెలిపారు. కాన్యక్రమంలో గ్రామ దత్తత అధికారి ఎస్.ఐ. జి.మాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
శుక్రవారం 9, మే 2025

సాయుధ దళాలకు మద్దతుగా ర్యాలీ

విశాలాంధ్ర - రాజాం: ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయడంలో సాయుధ దళాల వీరోచిత పోరాటం మరవలేనిదని, ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ పరిణామమంటూ, సాయుధ దళాల పోరాటానికి మద్దతుగా గురువారం సాయంత్రం రాజాంలో బొబ్బిలి జంక్షన్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగులు, మానవత సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. సంస్థ అధ్యక్షుడు కొత్త సాయి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సభ్యులు పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, బివి అచ్యుత కుమార్, ఆర్‌ఆసిహెచ్ జయదేవ్, ఆర్విజె నాయుడు, గట్టి పాపారావు, టీటివి రమణమూర్తి, మాజీ సైనిక ఉద్యోగులు బొడ్డు అప్పలరాజు, ఏ.అనంతరావు, నమ్మిశెట్టి సురేష్, కొత్తకోట గోవిందరావు, తవ్వా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ వాతావరణం నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, డ్రోన్స్, బాంబ్, డాగ్ స్క్వాడ్తో తనిఖీలు ముమ్మరం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అప్రమత్తమైనట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ముఖ్య ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో అప్రమత్తమై, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించుటకు తనిఖీలు ముమ్మరం చేసామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూలు, చింతపల్లి లైట్ హౌస్, తీర ప్రాంతంలోని గ్రామాల్లోను మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి, తీరప్రాంత గ్రామస్థులను అప్రమత్తం చేసామన్నారు. అంతేకాకుండా, కోరుకొండ సైనిక్ స్కూలు, అధికార భవనాలు, చింతపల్లి లైట్ హౌస్ తోపాటు మరియు ఇతర తీరప్రాంత గ్రామాలైన తిప్పలవలస, ముక్కాం, నీలగెడ్డపేట, పాద్దూరు, చేపల కంచేరులో డ్రోన్స్, డాగ్స్, బాంబు స్క్వాడ్స్ తనిఖీలు చేపట్టామన్నారు. సముద్రంలో చేపల వేట పై నిషేదం ఉన్నందున మత్స్యకారులను వేటకు వెళ్ళవద్దని, తీర ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే షిప్పులు, అనుమానస్పద వ్యక్తులు ఎదురుపడితే సమాచారాన్ని మెరైన్ లేదా స్థానిక పోలీసులకు అందించాలని కోరామన్నారు. యుద్ధ ప్రభావం తీర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, మెరైన్ పోలీసుల సహకారంతో పటిష్టమైన భద్రత చర్యలుచేపట్టడంతోపాటు, తీరప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసామని తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భోగాపురం సిఐ కే.దుర్గా ప్రసాద్, మెరైన్ సిఐ బి.వి.జె.రాజు, భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన

విశాలాంధ్ర - మెంటాడ: చల్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను జిల్లాస్థాయి టీమ్ సిఎంఓ వి ఆదినారాయణ ఆధ్వర్యంలో పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 2025-2026 విద్యా సంవత్సరం నిమిత్తం అందించవలసిన పాఠ్యపుస్తకములు, నోట్ బుక్స్, స్టూడెంట్ కిడ్స్, నిల్వ మరియు పంపిణీపై సమీక్ష నిర్వహించారు. స్టాక్ యొక్క నిర్వహణ ప్యాకింగ్ పద్ధతి రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై మండల అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంఓ కె.రామారావు, మండల విద్యాశాఖ అధికారి యువిఎస్‌వి శివాజీ వర్మ, కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

45వ వార్డులో నగర పాలక కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈరోజు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం 45వ డివిజన్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. పౌర సేవలు ఏ విధంగా అందిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. అనంతరం పలు ప్రాంతంలో పర్యటించి, అక్కడక్కడ చెత్త చెదరాలను చూసి వెంటనే వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో బాబ్ కార్టు సహాయంతో పెద్ద ఎత్తున పేరుకున్న చెత్తాచెదారాలను తరలించారు. ఆ తర్వాత ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అన్నాక్యాంటీన్ వద్దకు చేరుకున్నారు. ప్రజలకు అందుతున్న అల్పాహారం, ఇతర సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కాలువలో చెత్తాచెదారాలు పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు పూడికతీతను తొలగించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. అవి జరుగుతున్న ప్రక్రియలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ప్రజలు కూడా కాలువలో చెత్తాచెదారాలు వేయకుండా డస్ట్ బిన్లను వినియోగించుకోవాలని సూచించారు.

నందమూరి అభిమానుల అన్నదానం..

విశాలాంధ్ర - చీపురుపల్లి: నందమూరి తారకరామారావు అభిమానుల ఆధ్వర్యంలో చీపురుపల్లిలో గురువారం ఎన్టీఆర్ మీల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చీపురుపల్లిలో ప్రారంభించిన ఎన్టీఆర్ మీల్స్ పంపిణీ కార్యక్రమాన్ని నందమూరి సేవా సమితి ఆధ్వర్యంలో నిరంతరం కొనసాగిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందమూరి సేవ సమితి అధ్యక్ష, కార్యదర్శిలు మొసలకంటి లక్ష్మణరావు, నాగులాపల్లి నారాయణరావు, ఎన్టీఆర్ సభ్యులు సారంపటి సాయికుమార్, చందాక చిన్నం నాయుడు, సమాధుల కనకరాజు, లెంక గోవింద్, ముదిలి హరిబాబు, బురాడా కూర్మారావు, మీసాల రాజశేఖర్, గురనా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని, వయోపరిమితి 47 సంవత్సరాలు పెంచాలని, జిల్లాకు ఒకే పేపర్ విధానం ఉండాలని, పరీక్షలకు 90 రోజులకు గడువు ఇవ్వాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద నిరసన తెలియజేసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు పోరాట ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ సాధించుకోవడం జరిగిందని అలాగే రాష్ట్రంలో నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసి ఏడు సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏడు సంవత్సరాల తర్వాత నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధం అవ్వడానికి పరీక్షకు కనీసం 90 రోజులను సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అలాగే వయోపరిమితి 44 సంవత్సరాల కేటాయించడంతో ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తూ ఉంటూ వయోభారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాము, బాను, ఈశ్వర్‌రావు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాల్సిందే...

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడులకు ప్రతిచర్యలు ఉంటాయని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ.. దానిని ఆచరణలో చేసి చూపించారని.. యావత్ దేశం ఈ నిర్ణయాన్ని హర్షిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. ఉగ్రవాదులకు మర్చిపోలేని గుణపాఠం చెప్పారని ప్రశంసించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశం ఏ మతానికో, దేశానికో వ్యతిరేకం కాదన్నారు. పాకిస్థాన్ మిలటరీని వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపైనే ఈ యుద్ధమని చెప్పారు. భారతదేశం ఆలోచించే అడుగు వేస్తుందన్నారు. మన దేశ సైన్యానికి, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల యావత్ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోందని చెప్పారు. తెదేపా నుంచి కూడా మద్దతు తెలియజేస్తున్నామమని తెలిపారు. ఉగ్రవాదం అనేది ఒక భూతమని.. వీరి వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వీరిని అంతమొందించే వరకూ మన ప్రభుత్వం విశ్రమించకూడదని కోరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి నియోజకవర్గంలో పంటలను పరిశీలించడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోందని నాగార్జున అన్నారు. పది నెలలకు ముందు వారు చేయని పనులను కూడా ఇప్పుడు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఇంకా ధాన్యం కొనుగోలు జరగడం లేదంటున్నారని.. గత నాలుగైదు సంవత్సరాల్లో రబీలో ఎక్కడైనా ప్రొక్యూర్‌మెంట్ జరిగిందా? అని ప్రశ్నించారు. 'పోనీ.. ఖరీఫ్‌లో మీరు ఎప్పుడైనా సమయానికి కొనుగోలు చేశారా? మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పలు సందర్భాల్లో ధాన్యమిచ్చిన రైతులకు 14 రోజుల్లో డబ్బులిస్తామని చెప్పేవారు. నెలలు, సంక్రాంతి వెళ్లినా చెల్లింపులు జరిగేవి కావు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐవిపి రాజు, కర్రోతు నర్సింగరావు, ప్రసాదుల ప్రసాద్, బొద్దుల నర్సింగరావు, అల్తి బంగారు బాబు, కనకల మురళీమోహన్రావు, గంటా పోలి నాయుడు, మైలపల్లి సింహాచలం, గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లను పెంచాలి

విశాలాంధ్ర - విజయనగరం: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సులభతర రీతిలో రెవెన్యూ వసూళ్ళను పెంచాలని సిబ్బందికి, అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొండిబకాయలను 15 రోజుల్లో గా వసూలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఇంకా పన్ను విధించని ఖాళీ స్థలాల కు, పన్ను విధించాలని చెప్పారు. అలాగే అనధికార కొళాయి కనెక్షన్లను గుర్తించి తక్షణమే తొలిగించాలని ఆదేశించారు. నీటి చార్జీలను త్వరితగతిన వసూలు అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే ప్రధానం..

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రతి ఒక్క విద్యార్థి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని డాక్టర్ మిరియాల కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో పిల్లల మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం పురస్కరించుకొని పిల్లల మానసిక ఆరోగ్యము యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డా. మిరియాల కృష్ణారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పిల్లల మానసిక ఆరోగ్య యొక్క ప్రాముఖ్యత గురించి ముందస్తు జోక్యం మరియు చికిత్సల గురించి తెలియజేయడం జరిగింది. పిల్లల భావోద్వేగ శ్రేయస్సు, మద్దతు ఇవ్వడానికి కుటుంబాలు, కళాశాలలు మరియు సంఘాలు ప్రోత్సహించాలని ప్రతి బిడ్డ శ్రేయస్సు ప్రాధాన్యత ఇచ్చే ప్రపంచాన్ని నిర్మిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏడి ఎన్ఎస్‌వి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పిఓ సుబ్రహ్మణ్యం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - విజయనగరం: ప్రభుత్వ కార్యకలాపాలు, సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో సమాచార హక్కు చట్టం 2005 పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి పౌరునికి 2005 వ సంవత్సరంలో సమాచార హక్కు చట్టాన్ని ఒక ఆయుధంగా ఇచ్చి చట్టంగా రూపకల్పన చేసిందని అన్నారు. ఈ చట్టం అమలై 25 సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలలో ఇంకా అవగాహన రాలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. దీంతో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఈరోజు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రజలకు విస్తృత అవగాహన చేపట్టామన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో సమాచారం తెలుసుకోవడం ఎలా అన్న విషయం పైన, దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి, సమాచారం ఎన్ని రోజుల్లోగా పొందాలి, వంటి విషయాలపై ప్రజలకు సవివరంగా వెల్లడించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ఏఎస్ఐ ప్రతిభ

అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఇటీవల కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో నిర్వహించిన జాతీయస్థాయి డెడ్ లిఫ్ట్ బెంచ్ ప్రెస్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు పతకాలు, నాలుగు సిల్వర్ పతకాలు సాధించిన విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎఎస్ఐగా పని చేస్తున్న ఆలి త్రినాధరావును, ఉద్యోగ విరమణ చేసిన ఆర్మ్డ్ రిజర్వు హెచ్సీ మజ్జి శంకరరావులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగులో 93కిలోలు, 60+ విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, నాలుగు బంగారు పతకాలు సాధించిన ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు, 74 కిలోలు 70+ విభాగంలో పాల్గొని నాలుగు సిల్వర్ పతకాలు సాధించిన మజ్జి శంకర్రావులు మిగిలిన పోలీసు ఉద్యోగులకు ఫిట్నెస్ మేనేజ్మెంట్లో ఆదర్శంగా నిలిచారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో భూటాన్లో నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొని, మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏఎస్ఐ త్రినాధరావు పాల్గొని బెంచ్, డెడ్ లిఫ్ట్, స్క్వాట్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి, జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించారన్నారు. అదే విధంగా జిల్లా పోలీసుశాఖ ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో ఉద్యోగ విరమణ చేసిన మజ్జి శంకర్రావు కూడా ఈ పోటీల్లో 74 కిలోలు, 70జ విభాగంలో పాల్గొని, బెంచ్, డెడ్ లిఫ్ట్ మరియు స్క్వాట్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి నాలుగు సిల్వర్ మెడల్సును సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తుడుపులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తుడుపులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం నిర్వహించబడునని ఆలయ కమిటీ సభ్యులు ఎం.అప్పలనాయుడు, ఎన్.దేముడు నాయుడులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.09 గంటలకు హస్త నక్షత్రయుత అభిజిత్ లగ్నమందు వేద పండితుల మంత్రాచనాల నడుమ శ్రీ తుడుపులమ్మ తల్లి ఆలయం, విగ్రహం, శిఖర ప్రతిష్టలతో పాటు యంత్రా స్థాపన, కళశ స్థాపన, పూర్ణాహుతి అనంతరం అమ్మవారి దర్శనం జరిపించుటకు దైవజ్ఞులు నిర్ణయించారని తెలిపారు. 12 గంటల నుండి భారీ అన్న సమారాధన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 20వ తేదీన అమ్మవారి పండగ మహోత్సవం జరిపించడంతో పాటు, రాత్రి 10గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

విశాలాంధ్ర - బొబ్బిలి: కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికి మే 20 జరగనున్న దేశవ్యాప్త సమ్మెతో పాటు స్థానిక డిమాండ్ల పరిష్కారానికి సమ్మె నిర్వహించుట గురించి సమ్మె నోటీసు కమిషనర్‌కి ఇచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ మన దేశంలో స్వతంత్రం రాకపూర్వమే బ్రిటిష్ కాలం నుండి ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 వర్క్ మాన్ కాంపెన్సేషన్ యాక్ట్ 1923 వేతనాలు చెల్లింపు చట్టం 1935 తో సహా కనీస వేతనాలు చట్టం. 1948 బోనస్, గ్రాడ్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ గా మార్చివేసింది. ఈ లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరిస్తాయి సంఘం పెట్టుకునే హక్కును సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నాయి. ఉద్యోగ విధానంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ విధానం ద్వారా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా మార్చివేస్తాయి. వేతనాల కోసం బేరసారాలాడే హక్కులను కార్మికులు కోల్పోతారు. ఇంతటి ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ ప్రైవేట్ ఏజెన్సీలను అనుమతించవద్దన్న తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.గౌరేష్, జె.రామారావు, కమిటీ సభ్యులు బి.యుగంధర్, జి.వాసు, జి.శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో వల్లాపురం గ్రామానికి చెందిన ఆర్. అప్పలనాయుడు (29) బుధవారం తెల్లవారుజామున జమ్ము రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - మెంటాడ: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని మలేరియా అధికారి శ్రీనువాసరావు పేర్కొన్నారు. అనంతరం మెంటాడ మండలం పిట్టాడ వానిజ గ్రామంలో మలేరియా అధికారి శ్రీనువాసరావు సమక్షంలో ఎంపీడీవో బాడుమూర్తి ఆధ్వర్యంలో ఐ.ఆర్.ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించడం జరిగింది. మలేరియా అధికారి శ్రీనువాసరావు మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికి వైద్య ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రజలకు కాలానుగుణ వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి విమల, వైద్యా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఆఫీసర్‌ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో గత కొద్దిరోజులుగా ధర్నా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేయడం జరిగింది. వారి ప్రధానమైన డిమాండ్స్ ను ప్రభుత్వం త్వరగా చర్చించి వారి డిమాండ్స్‌ను నెరవేర్చాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పలికల శ్రీను, పట్టణ అధ్యక్షులు కే.శంకర్ రావు, జిల్లా కమిటీ సభ్యులు అశోక్. సుభాషిని, రమణమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అందుబాటులోకి 100క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు

విశాలాంధ్ర-జామి: మండలంలో రైతులకు అందుబాటులో 100క్వింటాళ్ళ పచ్చిరొట్ట ఎరువులను ఉంచడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు అన్నారు. గురువారం మండలంలోని విజినిగిరి వచ్చిన ఆయన పచ్చిరొట్ట ఎరువులను తన చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ, కట్టెలు, పిల్లిపెసర విత్తనాలు వచ్చాయని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాతసుఖీభవ పథకంలో భాగంగా రూ.20వేలను ఇవ్వడం జరుగుతుందని, అందుకు సంభందించిన విది విదానాలను ప్రభుత్వం విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రతీ రైతు ఆధార్ కార్డు, భూమి వివరాలు కలిగిన 1బి అడంగల్, రేషన్‌కార్డులను తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు పథకం లబ్దిదారుల పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సరఫరా అధికారి పి. మధుసూధనరావు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, ఉపసర్పంచ్ సత్యనారాయణ, సిరికి రామూర్తి, కసిరెడ్డి నారాయణరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు వహీదా తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం

విశాలాంధ్ర - నెల్లిమర్ల: రెడ్ క్రాస్ దినోత్సవ సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తనుశ్రీ కి రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని బంగారయ్య అన్నారు. గురువారం విజయనగరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాద్ రావు, సెక్రెటరీ కే సత్యం, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ రాణి ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గరివిడి మండలం రేగటిఅగ్రహారం గ్రామానికి చెందిన 8 ఏళ్ల తనుశ్రీ కి రక్తదానం చేయడం జరిగింది ఈ సందర్భంగా బంగారయ్య మాట్లాడుతూ .ప్రమాద సమయాల్లో ప్రతి ఒక్కరి ప్రాణాలను నిలబెట్టగలగడానికి ఈ రక్తం దోహదపడుతుందని అన్నారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ చేతుల మీదుగా బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు.

టీడీపీ క్యాడర్‌కు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - వంగర: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రెండు రోజుల రాజకీయ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యురాలు కావలి గ్రీష్మ వివరించారు. కార్యక్రమంలో పార్టీ నిర్మాణం, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, పార్టీ చరిత్ర, ప్రజా పోరాటాలు, విజన్ 2047, లీడర్షిప్ అంతే కాకుండా గుడ్ గవర్నెన్స్, సోషల్ మీడియా ప్రాధాన్యతలపై శిక్షణ నిర్వహించారు. 10 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 10 నెలల పాలనలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ పథకాలన్నీ ప్రజలకు వివరించాలన్నారు.

రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన



విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో శ్రీ సీతారాముల ఆలయం నిర్మాణానికి గ్రామ పెద్దలు, గ్రామస్తులు గురువారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు చేపట్టి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కాగా గతంలో నిర్మించిన రామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిగా తొలగించి నూతన రామాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు అందరూ ఏకతాటిపై నిర్మించాలని తపనతో శ్రీకారం చుట్టడం వలన గ్రామస్తులు అందరూ సహాయ సహకారాలు అందించాలని గ్రామ పెద్దలు గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రేమ పేరుతో వంచించిన నిందితుడికి 10 సం.ల కఠిన కారాగారం శిక్ష: ఎస్పీ

విశాలాంధ్ర - బొబ్బిలి: బొబ్బిలి పోలీసు స్టేషనులో 2022వ సంవత్సరంలో నమోదైన ప్రేమ పేరుతో వంచించి, అత్యాచారానికి పాల్పడి, పెండ్లికి నిరాకరించిన కేసులో నిందితుడు బొబ్బిలి మండలం సీతయ్యపేట గ్రామానికి చెందిన దివనాపు అఖిల్ అంబేత్కర్ (29 సం.లు)కి విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎస్.పద్మావతి పదిసంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.15వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీవకుల్ జిందల్ తెలిపారు. మండలం సీతయ్యపేట గామానికి చెందిన నిందితుడు దివనాపు అఖిల్ అంబేత్కర్ (29 సం.లు)అనే వ్యక్తి పాచిపెంట మండలానికి చెందిన ఒకామెను ప్రేమిస్తున్నానని నమ్మించి, వంచించి, శారీరకంగా అనుభవించి, పెండ్లికి నిరాకరించినట్లుగా ఇచ్చిన ఫిర్యాదుతో బొబ్బిలి పోలీసు స్టేషనులో 2022సంవ అప్పటి పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టుచేసి రిమాండుకు తరలించి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. న్యాయస్థానంలో నిందితుడు దివనాపు అఖిల్ అంబేద్కర్ నేరంకు పాల్పడినట్లుగా సాక్ష్యాలు నిరూపితం కావడంతో విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎ.డి.జె. కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి 10సం.లు కఠిన కారాగార శిక్ష మరియు రూ.15 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసువారి తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎన్.శకుంతల వాదనలు వినిపించగా, బొబ్బిలి ఇన్స్పెక్టరు కే.సతీష్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు హెడకానిస్టేబుల్‌ఎం.మన్మధరావు, సి.ఎం.ఎస్.2 కానిస్టేబుల్ సిహెచ్.సౌజన్య సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారన్నారు. కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్షపడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీవకుల్ జిందల్ ఐపిఎస్ అభినందించారు.